తండాల్లో తాగునీటి ఎద్దడి

- చింతల, లయన్ తండాల్లో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఆరేళ్లుగా అలంకారప్రాయంగా మిషన్ భగీరథ మంచినీటి ట్యాంక్
- నిరుపయోగంగా ఇంటింటికీ అమర్చిన నల్లాలు
- పట్టించుకోని అధికారులు


బోరుబావి వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు


నిరుపయోగంగా ఉన్న చింతలతండాలోని మిషన్ భగీరథ ట్యాంకు

జూలూరుపాడు: చింతలతండా గ్రామ పంచాయతీలో ఈ ఏడాది అప్పుడే తాగునీటి ఎద్దడి నెలకొంది. గిరిజనులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ ఇంటికి నల్లా ద్వారా మంచినీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ ఆ పథకం సక్రమంగా అమలు జరగకపోవడంతోపాటు, రక్షిత మంచినీటి పథకం (డైరెక్టింగ్ పంపింగ్) విద్యుత్ మోటార్ కాలిపోవడం, చేతి పంపులు మూలపడటంతో చింతలతండా, లయన్‌తండా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. చింతలతండా, లయన్ తండాలో 77 గిరిజన లంబాడి కుటుంబాలకు చెందిన సుమారు 340 మంది జనాభా. తాగునీటి కోసం 15 వేల లీటర్ల సామర్థ్యం గల రెండు మిషన్ భగీరథ ట్యాంకులను నిర్మించారు. మిషన్ భగీరథ ట్యాంకు నుంచి చింతలతండాకు నామమాత్రంగా నీరు సరఫరా అవుతుండగా, లయన్‌తండా ట్యాంకుకు నీళ్లు ఎక్కకపోవడంతో ఆరేళ్లుగా అలంకారప్రాయంగానే ఉంది. ఇంటింటికీ అమర్చిన నల్లాలు నిరుపయోగంగా ఉన్నాయి. మిషన్ భగీరథతో తాగునీటి సమస్య తీరుతుందని ఎంతో ఆశపడ్డ గిరిజనులకు నిరాశే మిగిలింది. ఈ రెండు గ్రామాల ప్రజల తాగునీటి అవసరాల కోసం రక్షిత మంచినీటి పథకం డైరెక్టింగ్ పంపింగ్ వ్యవస్థ (డీపీ) విద్యుత్ మోటార్ గత మూడు వారాల క్రితం కాలిపోయి మరమ్మతులకు గురైంది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతలతండా, లయన్ తండాలలోని చేతి పంపులు మూలపడటంతో మరింత ఇబ్బందిగా ఉందని గిరిజనులు వాపోతున్నారు. ఇటు మిషన్ భగీరథ నీళ్లు రాక మరోవైపు డీపీ, చేతి పంపులు మూలనడటంతో నానా అవస్థలు పడుతున్నట్లు గిరిజనులు రోదిస్తున్నారు. బోరుబావి ఉన్న వాళ్ల ఇంటికి వెళ్లి నీళ్లు తెచ్చుకొని గొంతు తడుపుకుంటున్నామని గిరిజనులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ విషయంపై జూలూరుపాడు ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి వివరణ కోరగా... ప్రస్తుతం మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయని, డీపీ మరమ్మతులకు గురైన విషయం తమ దృష్టికి వచ్చిందని, ఒకటి రెండు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

తాగునీరు దొరకడం లేదు...


గుక్కెడు మంచినీళ్లు దొరకడం కష్టంగా ఉంది. మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించారు గానీ నీళ్లు రావడం లేదు. తండాలో తాగునీటి సమస్యతో అందరం ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– భూక్యా తాకు, చింతలతండా

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..


రెండు తండాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డీపీ విద్యుత్ మోటార్ కాలిపోతే మరమ్మతులు చేయడం లేదు. భగీరథ నీళ్లు రాక, డీపీ, చేతి పంపులు పనిచేయక తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం.

– ధరంసోత్ పార్వతి, చింతలతండా

ఎవరూ పట్టించుకోవడం లేదు


తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అసలే ఎండాకాలం. తాగునీటి కోసం ఇళ్లలో బోరుబావి ఉన్న వాళ్ల ఇంటికి వెళ్లి ప్రతీరోజు నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది.

– భూక్యా జాని, చింతలతండా

క్లుప్తంగా

ధరణి దరఖాస్తుల పరిశీలన


క్షేత్రస్థాయిలో రైతుల భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పాల్వంచరూరల్: ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. తహసీల్దార్ వివేక్, డీటీ తిరుపతి, ఆర్ఐ హచ్యాలు మూడు బృందాలుగా పట్టణ, మండలంలో పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. పాండురంగాపురం, నర్సంపేట, ప్రభాత్ నగర్ ప్రాంతాల్లో రైతులతో మాట్లాడారు.

విధుల్లో చేరిన సీఐ


శివప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్ సీఐగా కె.శివప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏడుళ్లబయ్యారం నుంచి బదిలీలో భాగంగా త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. త్రీటౌన్‌లో పని చేసిన మురళి ఖమ్మం సీఎస్‌బీ–1 బదిలీపై వెళ్లారు. శివప్రసాద్‌కు స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఇంటర్ పరీక్షకు 143 మంది గైర్హాజరు

పాల్వంచరూరల్: మండల, పట్టణ పరిధిలోని నాలుగు సెంటర్లలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు మొత్తం 1,224 మంది విద్యార్థులకు 1,081మంది హాజరు కాగా 143 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు తెలిపారు.

కబ్జాను అడ్డుకోవాలి

పాల్వంచ: సిఖా నర్సింహులుకు చెందిన సర్వే నంబర్ 802లోని 1.26 కుంటల భూమిని కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, దళితుల భూమి ఆక్రమిస్తే సహించేది లేదని పలు పార్టీలు, దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఓ హోటల్‌లోని సమావేశ మందిరంలో వారు మాట్లాడారు. ఆర్థిక, అంగ, రాజకీయ బలంతో 150 మంది మనుషులను పెట్టి దళితుల భూమిలోకి ఎవరినీ రానివ్వకుండా అడ్డుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో కాల్వ భాస్కర్, కాల్వ ప్రకాశ్, బండి నాగేశ్వరరావు, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, ఝర్రా కామేశ్, కృష్ణ, శివ, విజయ్, రాంబాబు పాల్గొన్నారు.

విద్యాశాఖ సోషల్ ఆడిట్


ఆడిట్ నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఇల్లెందు: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరు, సమగ్ర శిక్షణ అమలు తీరుపై సోషల్ సర్వే ఆడిట్ నిర్వహించారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నోడల్ ఆఫీసర్ టీవీఆర్ఎస్ స్వామి మండల స్థాయిలో ప్రాథమిక విద్యాకార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ప్లానింగ్ విభాగం సభ్యులు ప్రొఫెసర్ బి.సంపత్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో 600 పైగా పాఠశాలల్లో తమ టీమ్ ద్వారా సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇల్లెందు మండలంలోని స్టేషన్ బస్తీ, రాఘవాపురం, మసివాగు ప్రాథమిక పాఠశాల, కొమరారం హైస్కూల్‌లో ఈ కార్యక్రమం అమలు విధానంపై ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు.

న్యూడెమోక్రసీ నుంచి బహిష్కరణ

సింగరేణి(కొత్తగూడెం): పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి కందగట్ల సురేందర్‌ను బహిష్కరిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముక్తి సత్యం శుక్రవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. వ్యాపారులు, పార్టీ శ్రేణులు, ప్రజలు ఇతనికి ఎలాంటి సహాయ, సహకారాలు అందించవద్దని పేర్కొన్నారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: పాతకక్షల నేపథ్యంలో దాడి చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... తోగ్గూడెం గ్రామానికి చెందిన జర్పుల లక్ష్మయ్య ఇంట్లో ఉండగా సోదరుడి కుమారుడు జర్పుల రాంబాబు శుక్రవారం కర్రతో దాడి చేసి గాయపరిచాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి: వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజాపరిషత్ డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. చేతిపంపుల రిపేర్లు, స్కీం బోర్ల రిపేర్లు, పైపులైన్ లీకేజీలు, మోటార్ల రిపేర్లు వంటివి ముందస్తుగా చేపట్టాలన్నారు. మండలంలో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు చేపట్టాలని, దీనికి పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్ల ద్వారా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోలన్నారు. ప్రతీరోజు గ్రామాల్లో శానిటేషన్ జరగాలని, ప్రత్యేక అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. ఎంపీడీఓ అశోక్ కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఏఈ వసంత, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి


మాట్లాడుతున్న నరేష్

జూలూరుపాడు: పడమటనర్సాపురం రెవెన్యూ పరిధిలో గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని అధికారులు తక్షణమే స్వాధీనం చేసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం మండల నాయకులు పడమటనర్సాపురం రెవెన్యూలో 162 సర్వే నంబర్‌లో గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. ఈ సమస్యను గతంలో పలుమార్లు ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బానోత్ ఇస్రా, లకావత్ శ్రీను, బానోత్ రూపా, అభిమిత్ర, బొల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పితృస్వామ్య బలోపేతాన్ని వ్యతిరేకిద్దాం..


మాట్లాడుతున్న మంగ

ఇల్లెందురూరల్: మోదీ ప్రభుత్వం పితృస్వామ్య భావజాలాన్ని బలోపేతం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మహిళలందరూ పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ పిలుపునిచ్చారు. ఎల్లాపురం గ్రామంలో శుక్రవారం ఏర్పాటైన మహిళల సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి 8న ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పితృస్వామ్య వ్యతిరేక దినోత్సవంగా జరుపుకోవాలన్నారు.

రాజ్యాంగం లింగ, కుల, మత, జాతి వివక్ష లేకుండా ఇచ్చిన సమాన హక్కుల ఆధారంగా స్త్రీలు అన్ని రంగాల్లో స్వేచ్ఛగా ఎదిగే హక్కు ఉందంటూ పోరాడి అనేక హక్కులను సాధించుకున్నారని గుర్తు చేశారు. మహిళల ఆర్థిక స్థితి మహిళా సాధికారతను సమాన హక్కును ప్రభావితం చేస్తుందన్నారు. సమావేశంలో చంద్రకళ, రామనర్సమ్మ, సుశీల, సావిత్రి, కౌసల్య, కుమారి పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి


జూలూరుపాడు: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్‌టీఎస్ నాయకులు

జూలూరుపాడు: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు గుర్తింపుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్ టీఎస్), ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడులో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరుల చిత్రపటాలకు సంఘం జిల్లా అధ్యక్షుడు మోదుగు రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. పోతురాజు నరసింహారావు, మోదుగు మణికుమార్, పోతురాజు ఆనందరావు, చెంగల గురునాథం, చాపలమడుగు నరసింహారావు, చెంగల నరసింహారావు, మందా వెంకటేశ్వర్లు, కత్తి నాగయ్య, మందా మాధవరావు, కోటా దేవయ్య, మందా బాబు పాల్గొన్నారు.

ఇల్లెందు: హరిజన కాలనీలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ నాయకుడు మెంతెన వసంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆలేటి కిరణ్, ఆదూరి రవి, ప్రసాద్, జన్ను, వేణు, సంపత్, భరత్, అనిల్, రాజ్‌కుమార్, వెంకన్న పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా క్రాంతికుమార్

పాల్వంచరూరల్: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా రెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోలోజు క్రాంతికుమార్‌ను పార్టీ జిల్లా అధ్యక్షులు కేవీ రంగాకిరణ్ నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలను అప్పగించిన రంగాకిరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

నగదు వితరణ


హెచ్ఎం రేణుకకు నగదు అందిస్తున్న శ్రీనివాసరావు

పాల్వంచ: లయన్స్ క్లబ్ సభ్యులు, కేటీపీఎస్ ఏడీఈ చాట్ల శ్రీనివాసరావు తన పుట్టినరోజు సందర్భంగా గట్టాయిగూడెం ప్రభుత్వ పాఠశాలకు శుక్రవారం రూ.పదివేలు వితరణగా అందించారు. మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సామగ్రికి ఈ డబ్బు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆరుద్ర సత్యనారాయణ, చేపూరి బ్రహ్మాచారి, పుట్టా నాగేశ్వరరావు, సతీశ్, శ్రీను, టీచర్లు అరుణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విలీన సభలను జయప్రదం చేయండి


ప్రచారం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): మూడు విప్లవ పార్టీలు విలీనమై సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఏర్పాటవుతున్న సందర్భంగా ఖమ్మంలో 3వ తేదీ నుంచి మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. జాతోట్ కృష్ణ మాట్లాడుతూ... కార్మికుల, ప్రజల హక్కులను కాపాడేందుకు మూడు పార్టీలు విలీనమవుతున్నాయని తెలిపారు. ఈ మేరకు బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.సతీష్, వై.గోపాలరావు, చంద్రశేఖర్, బి.ధర్మ, రాధ, మరియ, నిర్మల, నాగమ్మ, మణెమ్మ, సరళ, సురేష్, వెంకటేశ్వర్లు, కృష్ణ, కాంతి, లలిత, రోజా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం నుంచి మదర్ తండా వరకు రూ.79 లక్షల వ్యయంతో గిరిజనాభివృద్ధి శాఖ ఎస్టీఎస్డీఎఫ్ నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలపై దృష్టి సారించామని, మండలంలో రూ.2.55 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. పల్లె ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.కోటి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి తయారు చేసిన ప్రతిపాదనలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్ పాషా, తహసీల్దార్ రామకృష్ణ ప్రసాద్, సీడీపీఓ కనకదుర్గ, డీఈ నాగేశ్వరరావు, ఏనుగుల అర్జున్‌రావు, కరిష రత్నకుమారి, ఎంపీటీసీ కళ్యాణ్ సత్యనారాయణ, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

నేడు శంకుస్థాపనలు...

పాల్వంచరూరల్: మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపనలు చేయనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి విసంశెట్టి పూర్ణచందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళా దినోత్సవం నిర్వహించాలి


అధికారులతో మాట్లాడుతున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య అన్నారు. శుక్రవారం ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కార్పొరేట్ పరిధిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న అధికారులతో, మహిళా ఉద్యోగినులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చేయాల్సిన కార్యక్రమాలపై సమీక్షించారు. 11న హెచ్ఆర్‌డీ కాన్ఫరెన్స్ హాల్‌లో, 12న కేసీఓఏ క్లబ్‌లో నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికలు సిద్ధం చేయాలని, కార్యక్రమాల్లో మహిళా ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎం (పర్సనల్) ఈఈ సెల్ సీఎస్ఆర్ కవితానాయుడు, ఏజీఎం పర్సనల్ కోడూరు శ్రీనివాస్‌రావు, డీవైపీఎంలు కే.శివకుమార్, జీకే కిరణ్‌కుమార్, పీఏ వరప్రసాద్, సేవా సెక్రటరీ మునీల, సింగరేణి సేవా కోఆర్డినేటర్ ఇజాజ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బహిరంగ సభను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఇల్లెందు పరిసర ప్రాంత ముస్లింల చైతన్యం కోసం జల్సే ఇస్తేక్బల్ రంజాన్ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మౌలానా ఇనాయతుల్లా రషీ తెలిపారు. శుక్రవారం ఇల్లెందు కాకతీయ నగర్ మస్తాబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. 3వ తేదీన బొజ్జాయిగూడెం ఎస్ఎస్ గార్డెన్‌లో సాయంత్రం 3గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో తరలిరావాలని, మహిళల కోసం ప్రత్యేక పరదా ఏర్పాటు చేశామని చెప్పారు. గొప్ప ఇస్లామిక్ ఆధ్యాత్మిక బహిరంగ సభను ఏర్పాటు చేశామని యువతను చైతన్యం చేసేందుకు ఈ కార్యక్రమం ఉద్దేశ్యం అన్నారు. కార్యక్రమంలో హఫీజ్ ఇబ్రహీం, హబీబ్, అమానతుల్లా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే మాదిగల లక్ష్యం


మాట్లాడుతున్న మోదుగు జోగారావు

జూలూరుపాడు: బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడిస్తామని మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు జోగారావు అన్నారు. శుక్రవారం జూలూరుపాడు ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చిన బీజేపీ పదేళ్ల పాలన పూర్తి కావస్తున్నా మాదిగలకు న్యాయం చేయలేదన్నారు. మాదిగల ఓట్లు చీల్చి లబ్ధిపొందేందుకు బీజేపీ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని భుజానికెత్తుకుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదలైన మాదిగల ఉద్యమం మూడు దశాబ్దాలుగా కొనసాగుతోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎస్సీ వర్గీకరణ చేస్తామని కబుర్లు చెప్పి మాదిగలను మోసం చేశాయన్నారు. కశ్మీర్ విభజన, ఆర్టికల్ 370 రద్దు, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ బిల్లులను ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందాయన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో బీజేపీ ఎత్తుగడలను మాదిగలకు వివరించేందుకు మాదిగల జోడోయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓటమే మాదిగల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వేల్పుల నరసింహారావు, మోదుగు సుగుణారావు, మందా సురేష్, గోలి సెల్వరాజ్, దేవేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మహిళా కళాశాలలో సింపోజియం


సింగరేణి జీఎంను సన్మానిస్తున్న అధ్యాపకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఫ్యూచర్ స్కోప్ ఇన్ నానో టెక్నాలజీ అనే అంశంపై శుక్రవారం సింపోజియం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సింగరేణి జీఎం (ఎడ్యుకేషన్) ఎస్.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. మాట్లాడుతూ... కాలానుగుణంగా వస్తువుల పరిణామాలలో మార్పుకు కారణం నానో టెక్నాలజీ అన్నారు. దీనిపై అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. గౌరవఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ డి.హరినాథ్ మాట్లాడుతూ... ప్రకృతిలోని అద్భుతాలను మనకు అనుగుణంగా మార్చుకునేదే సైన్స్ అన్నారు. స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యం ఇస్తూ దేశం అభివృద్ధి చెందాలంటే నానో టెక్నాలజీ వల్లనే సాధ్యమని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా జీఎం, అతిథులను సన్మానించారు. వరంగల్ నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఉదయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ శారద, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ పి.సునీత, వి.శ్రీలత పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వీడాలి


రికార్డులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత శానిటరీ వర్కర్లదేనని, విధుల్లో నిర్లక్ష్యం చేయడం సరికాదని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. ప్రజల నుంచి, మున్సిపల్ కౌన్సిలర్ల నుంచి వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం పట్టణంలోని ప్రగతి మైదానంలో చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఆటోల పనితీరు ఎలా ఉంది..? రిపేర్ చేయించాల్సిన వాహనాలు..? ప్రతి వాహనం ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తున్నదా? ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎందుకు స్పందించడం లేదని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని 36వార్డులకు 42 స్వచ్ఛ ఆటోలను కేటాయించినప్పటికీ ఎక్కడపడితే అక్కడ పారిశుద్ధ్య లోపం కనిపించడానికి గల కారణాలను తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ప్రతీ వాహన డ్రైవర్ ఉదయం 5 గంటలకే పనులను ప్రారంభించాలని, పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో క్లీన్ కొత్తగూడెంగా అవార్డులు తీసుకున్న ఈ పట్టణం ప్రస్తుతం దుర్గంధంగా ఎందుకు మారిందని సిబ్బందిని ప్రశ్నించారు. ఇకపై ప్రతీ గల్లీ, ప్రధాన రోడ్లన్నీ శుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను, జవాన్లను ఆదేశించారు. అనంతరం ప్రగతి మైదానంలో జరుగుతున్న పలు అభివద్ధి పనులను పరిశీలించారు. వార్డు కౌన్సిలర్లు వేముల ప్రసాద్ బాబు, తలుగు అనిల్, మున్సిపల్ డీఈ రవికుమార్, ఏఈ రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహాన్, వీరభద్రచారి పాల్గొన్నారు.